క్లుప్తంగా

వైభవంగా బగళాముఖి అమ్మవారి జయంతి



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి జయంతిని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునే 108 కలశాలలో 250 లీటర్ల ఆవుపాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తూర్పుగోదావరి నుంచి వచ్చిన 9 మంది వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి పల్లకి ఉత్సవం, తులాభారం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఒంగోలుకు చెందిన శ్రీనివాసరావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా, బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు దేవాలయానికి విచ్చేసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. దేవాలయం ప్రాంగణంలో వేద పండితులతో చండీ యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



నిజాంపట్నం: గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయనిర్మల మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషిచేయాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నాజర్‌ఖాన్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ సేవలు మరువలేనివి



అమర్తలూరు(వేమూరు): డొక్కా సీతమ్మ అనాథలకు చేసిన సేవలు మరువలేమని మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ సేవా సమితి అధ్వర్యంలో డొక్కా సీతమ్మ జ్ఞాపకార్థం పేదలకు మజ్జిగ, స్వీట్స్ శుక్రవారం పంపిణీ చేశారు. సీతమ్మ, భర్త జోగన్న పేదలకు అన్నదానం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ వెంకటేశ్వరరావు, గ్రంధి సురేష్, మాజీ జెడ్పీటీసీ రాపర్ల వెంకట సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ కూచిపూడి సతీష్, నన్నపనేని అనిల్, అత్తోట రమేష్, వేసపోగు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునపై అసత్య ప్రచారం సహించేది లేదు

మూల్పూరు(వేమూరు): మంత్రి మేరుగ నాగార్జునపై మూల్పూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రోజ్ మేరీ భర్త మాణిక్యరావు అసత్య ప్రచారాన్ని సహించేలేదని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. గ్రామంలో శుక్రవారం విలేకరులతో నాయకులు మాట్లాడారు. 2013 పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతో మాణిక్యరావు భార్య రోజ్‌మేరీ సర్పంచ్‌గా గెలిచి, తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీలోకి చేరారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలో అనేక అవినీతికి పాల్పడినట్లు విమర్శించారు. మాణిక్యరావు దళిత ద్రోహి అని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి మంత్రి మేరుగ నాగార్జునను విమర్శించే అర్హత లేదన్నారు. మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తెలుగు దేశం పార్టీ నాయకుల సూచనల మేరకు కొత్త డ్రామా సృష్టించారని మండిపడ్డారు. మూల్పూరు విజయ సాగర్, మూల్పూరు ప్రతాప్ కుమార్, ఎంపీటీసీ పోలి పాపారావు, కోళ్లమూడి అశోక్ కుమార్, బర్మా ప్రవీణ్ కుమార్, అమర్తలూరు వెంకయ్య, పోతర్లంక సురేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు 'నీళ్లు' వదిలేసి..

- వేసవిలో ఆదాయ మార్గంగా తాగునీటి వ్యాపారం
- అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ఇప్పటికే జిల్లాలో 10 మందిపై కేసులు నమోదు
- లైసెన్స్‌లు లేని ప్లాంట్లపై నిరంతరం తనిఖీలు



వాటర్ ప్లాంట్‌లో నీటిని శుద్ధిచేసే యంత్రం



వాటర్ క్యాన్లు

బాపట్లటౌన్: ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించిన కొందరు వ్యాపారులు నిబంధనలకు 'నీళ్లు' వదిలేశారు. వేసవిలో తాగునీటి వ్యాపారం లాభాలు తెచ్చిపెడుతుండటంతో.. నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. మినరల్ వాటర్ పేరుతో వీధికొక ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ, మండల పరిధిలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్ల విషయంలో అధికారులు చూసి, చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించడానికి మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్ నిర్వహణకు ల్యాబ్ టెక్నీషియన్ అవసరం ఉంటుంది. కానీ, ఈ ల్యాబ్ టెక్నీషియన్ ఎక్కడా కనిపించరు.

అధిక ధరలు..

ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండటంతో మునిసిపాలిటీ పరిధిలోని చెరువులు, వివిధ గ్రామాల్లోని చెరువుల్లో నీరు అడుగంటే అవకాశం ఉంది. వేసవిలో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందించే నీరు పూర్తిస్థాయిలో పరిపోక..పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మినరల్ వాటర్ ప్లాంటుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకున్న మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు 20 లీటర్ల క్యాన్ వాటర్‌ను రూ.30 నుంచి రూ.40లకు పెంచేశారు. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ప్రజలు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

నిబంధనలివీ..

- వాటర్ ప్లాంటు ఏర్పాటుకు సంబంధిత పట్టణ, గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తప్పనిసరి.
- పరిశ్రమల శాఖ నుంచి పార్టు-1 అనుమతి పొందాలి.
- భారతీయ ప్రమాణాలు (ఐఎస్ఐ) అనుమతి పొందాలి.
- ప్లాంట్లలో ఏసీతో పాటు మైక్రో బయాలజీ, కెమికల్ ల్యాబ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్స్ ఉండాలి.
- ప్రతిరోజు... నెలకొక రోజు నీటిని వేర్వేరుగా పరీక్షలు నిర్వహించి, రికార్డులను అధికారులకు అందజేయాలి. అయితే ఇవేవీ మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు పాటించడం లేదు.

పట్టించుకోని అధికారులు..

తాగునీటి నాణ్యతా ప్రమాణాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటిని శుద్ధిచేయకుండా యథేశ్చగా విక్రయాలు జరిపే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు చర్యలు తీసుకోవడం లేదు. ఆహార భద్రతా అధికారులు సీల్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్ల ప్లాంట్లపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నారు. పట్టణ పరిధిలో వాటర్ ప్లాంట్ల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖాధికారులపై ఉంటుంది. విచ్చలవిడిగా వ్యాపారాలు సాగించే యజమానులపై చర్యలు తీసుకునే సమయంలో వీరితోపాటు ఆహార భద్రత, విజిలెన్స్ అధికారుల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలేమీ కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి ప్లాంట్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనుమతులు లేని ప్లాంట్‌లు సీజ్ చేస్తాం



వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇష్టానుసారంగా నెలకొల్పే వాటర్ ప్లాంట్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. జిల్లాలోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారుల సమన్వయంతో దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. ఇప్పటికే జిల్లాలో 10 మందిపై కేసులు నమోదు చేశాం. వాటర్ ప్లాంటు నెలకొల్పే ముందు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. నెలకోసారి నీటి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించుకోవాలి. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– జి.ప్రభాకరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి, బాపట్ల జిల్లా.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: వెల్లటూరులో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే భట్టిప్రోలు టౌన్ పరిధిలోని రైలుపేట, హనుమాన్ పేట, క్రీస్తు భవన్ పరిధిలో కూడా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

చింతర్లంకలో ఉచిత కంటి వైద్య శిబిరం

చింతర్లంక(వేమూరు): చింతర్లంక గ్రామంలో సర్పంచ్ తోడేటి శాంతకుమారి అధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు 90 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలున్న వారికి ఆపరేషన్ చేసి, కళ్లజోళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, కనపర్తి మోహనరావు, సింగం కృష్ణ, మాతంగి రత్నకుమార్, కోగంటి సాంబశివరావు, తోడేటి ఫ్రాన్సిస్, తోడేటి లాజరు, మేకతోటి ఎలియా పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

వేమూరు: 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం సందర్భంగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయంతం చేసినందుకు సాయంత్రం 4 గంటలకు తహసీల్దారు కార్యాలయం నుంచి రైల్వే గేటు వరకు ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ బైక్ ర్యాలీలో మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కదలి వచ్చి పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు సంక్షేమ పథకాలపై సమీక్ష

వేమూరు: నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై కొల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10:30 గంటలకు సమీక్షాసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

'మా నమ్మకం నువ్వే జగన్' అంటున్న ప్రజలు

ఎమ్మెల్యే కోన రఘుపతి



దుకాణం వద్ద స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని భావన్నారాయణస్వామి దేవాలయం ప్రాంతంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ..ఈ కార్యక్రమం ద్వారా 7 లక్షల మంది ప్రత్యక్షంగా ప్రజలను కలుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ప్రజలే తమ ఇళ్లకు, వ్యాపార దుకాణాలకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించుకుంటున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న విశ్వాసం అర్థమవుతోందన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో ఇష్టమొచ్చినట్లు పాలన కొనసాగించిందని కోన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో అర్హతే ఆధారంగా ప్రతి లబ్ధిదారునికి నేరుగా సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పినట్లు 175 నియోజక వర్గాల్లో విజయం వైఎస్సార్ సీపీదేనని కోన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు కాగిత యర్రయ్య, మోర్ల సముద్రాల గౌడ్, ఇనగలూరి మాల్యాద్రి, వేల్పుల మీరాభి, గేరా మణిభూషణం, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, కొక్కిలిగడ్డ చెంచయ్య, కావూరి అంజిరెడ్డి, బుల్లిరెడ్డి, కొత్రా ఏడుకొండలు, ఖాశీం, వెదురుపర్తి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



పరీక్షస్తున్న దంత వైద్యులు

చెరుకుపల్లి: విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో శుక్రవారం ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి విద్యార్థులకు హ్యాపీ హాస్పిటల్ తెనాలి, ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల గూడవల్లి, రాజేశ్వరరావు డెంటల్ హాస్పిటల్ గుళ్లపల్లి వారి సౌజన్యంతో సుమారు 650 మంది చిన్నారులకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డీపీఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ సాయి గణేష్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలలో చదువుతో పాటు, విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా ఎప్పటికప్పుడు యాజమాన్యం తగు శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నర్గీస్ క్వాజి, వైద్యులు డాక్టర్ అరుణ్, డాక్టర్ పావని, డాక్టర్ వెంకట రాఘవేంద్రరావు, వైద్య, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

5న మహిళా మార్ట్ ప్రారంభం

రేపల్లె: పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో రేపల్లె మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను మే 5న, శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మార్ట్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

రావికింపాడు(వేమూరు): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నలుగురిపై నమోదు చేసినట్లు రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. కొల్లూరు మండలంలోని రావికింపాడు గ్రామానికి చెందిన గోవిందా సుజాత మేకలు, కుందేళ్లు, కోళ్ల పోషణతో జీవనం సాగిస్తోంది. సుజాత ఇంటి పక్కన ఉన్న మువ్వ సుబ్బారావు, మువ్వ నాగేశ్వరరావు, మువ్వ శ్రీదేవి, సుమతి ఇళ్లు ఉన్నాయి. సుజాత పెంచుతున్న మేకలు, కుందేళ్లు, కోళ్లు చనిపోతుండటంతో.. బాధను తట్టుకో లేక తిట్టుకుంటోంది. దీంతో అగ్ర కులానికి చెందిన నలుగురు జోక్యం చేసుకొని కులంతో పేరుతో తనను దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు కింద ఫిర్యాదు చేయడంతో.. ఎస్ఐ రాజీవ్ శ్యామ్యూల్ రేపల్లె డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. రావికింపాడు గ్రామంలో కేసును పూర్తిగా విచారించి, కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. వ్యక్తులను త్వరలో అరెస్టు చేయడం జరుగుతుందని చెప్పారు. విచారణలో వేమూరు రూరల్ సీఐ వెంకటేశ్వరరావు, కొల్లూరు ఎస్ఐ రాజీశ్యామ్యూల్ పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఎత్తు తక్కువ కావడంతో వాహనాల రాకపోకలకు అవాంతరం కలుగుతోంది. స్థానిక ఎస్సీ కాలనీ వాసులు సమస్య తీవ్రతను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడారు. విద్యుత్ స్తంభాలు వేయాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ స్తంభాలు వేశారు. ప్రస్తుతం ఏడు స్తంభాలు వేయడం జరిగిందని, మిగిలనవి రాగానే వేస్తామని ట్రాన్స్‌కో ఏఈ ఏడుకొండలు తెలిపారు.

అదనపు చార్జీలు అడిగితే ఫిర్యాదు చేయండి

రేపల్లె రూరల్: గ్యాస్ సిలిండర్ డెలివరీ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ స్పందించిందని పట్టణ అభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ ఏజెన్సీలు, డెలివరీ బాయ్‌లు గ్యాస్ బండ డెలివరీతో రూ.50 నుంచి రూ.70లు వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినియోదారుల నుంచి అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు స్పందించినట్లు చెప్పారు. దీనిపై తాజాగా నిబంధనలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలో మీటర్ల లోపు వరకు వినియోగదారుడి నుంచి ఏజెన్సీలు ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. గ్యాస్ బిల్లుపై ధర మాత్రమే చెల్లించాలన్నారు. 15 కిలోమీటర్ల దూరం వరకు రూ.20లు, దాటిన తర్వాత రూ.30లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అంతకుమించి ఆదనంగా ఎవరైనా డబ్బులు అడిగితే టోల్ ఫ్రీ నంబర్లు 1967, 1800 233 555కు సమస్యను తెలపాలన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని వాటర్ షెడ్‌లోని మోటారు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు అనుమతితో 6, 15, వార్డు సభ్యులు పెరికల శ్యామ్, అబ్దుల్ కరీమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరమ్మతులు చేయించారు. మెయిన్ రోడ్డులోని పైప్‌లైన్ మరమ్మతులను 24 గంటల్లో పూర్తి చేశారు. గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి మాట్లాడుతూ.. పబ్లిక్ కొళాయిల ద్వారా నీరు వృథా కాకుండా చూడాలని ప్రజలను కోరారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

భట్టిప్రోలు: భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారంటూ ఓ వివాహిత భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ కథనం మేరకు..వెల్లటూరుకు చెందిన షేక్ సుమకు 2006లో కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం రామాపురానికి చెందిన షేక్ సుభానితో వివాహం జరిగింది. వీరికి ఇరువురు సంతానం. నాలుగేళ్లుగా భర్త సుభాని, అత్తమామలు, తోడికోడళ్లు చిత్ర హింసలు పెడుతున్నారని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. సుమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భట్టిప్రోలుకు చేరిన ప్రచార భేరి

భట్టిప్రోలు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని సీపీఎం జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్, జి.సుధాకర్ పేర్కొన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం నిర్వహిస్తున్న రాజకీయ ప్రచార జాత శుక్రవారం భట్టిప్రోలుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా పని చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోళ్ల నాగరాజు, బొనిగల అగస్టీన్, ఎం. సత్యన్నారాయణ, వేమూరి మరియదాసు, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

చెరుకుపల్లి: ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలందరినీ గుర్తించి బడిలో చేర్పించాలని చెరుకుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.శైలజ సూచించారు. మండల కేంద్రంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం అక్కల బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మరివాడ శివ ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు దివి లక్ష్మీనారాయణ, సీఆర్పీ బి.విజయ్‌కుమార్, కాటూరు నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై సీఆర్పీలకు శిక్షణ

పిట్టలవానిపాలెం: విద్యా వనరుల కేంద్రంలో సోషల్ ఆడిట్‌పై శుక్రవారం సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయి రిసోర్సు పర్సన్, మంతెనవారి పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జయకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గత, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలల పరిస్థితి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై సర్వే ఏ విధంగా నిర్వహించాలనే విషయాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు, చందోలు నీలి బంగారయ్య, హెచ్ఎం మురళీధరరావు, సీఆర్పీలు కమల, మునలయ్య, స్రవంతి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలపై గ్రామీణులకు అవగాహన

నిజాంపట్నం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సదుపాయాలు తెలుసుకునేందుకు 'రాత్రి షివిర్' అనే కార్యక్రమం ఖాతాదారులకు ఉపయోగపడుతుందని రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) ఎన్ఎల్‌కేఎంవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ నిజాంపట్నం బ్రాంచ్ ఆధ్వర్యంలో బావాజీ పాలెంలో రాత్రి షివిర్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎం ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్రామీణులు పగలు తమ పనులతో అందుబాటులో ఉండరని, అందువల్ల ఈ కార్యక్రమాన్ని రాత్రిళ్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఎస్‌బీఐ సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించేందుకు అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకు సేవలు, రుణ సదుపాయాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ప్రతి నెలా రెండు మూడు గ్రామాల్లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రాంచ్ మేనేజర్ కె.దామోదర రాజారావు, ఏపీఎం కృపాసాగర్, సీసీ దివి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం



సమ్మేళన సభలో పూర్వ విద్యార్థులు

మూల్పూరు(వేమూరు): అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజర్వేడు ఇన్‌స్పెక్టర్ అదేపల్లి గణపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విక్టర్ మోజేష్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు 32 మంది పాఠశాలలో సైకిల్‌స్టాండ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకొస్తున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు వి.రవి కిరణ్, ఎం.వేణు ప్రసాద్, ఎం.వినయకుమార్, సుధీర్, సురేష్, శ్రీధర్ పాల్గొన్నారు.